క్లుప్తంగా

ఇంటర్‌లో అడ్మిషన్ గడువు పొడిగింపు

దొనకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 31వ తేదీ వరకు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు పొడిగించినట్లు ప్రిన్సిపల్ కె.దునుమణి తెలిపారు. హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు ఉన్నాయని, గ్రామాల్లో 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు నూతనంగా చేరిన వారికి అందజేస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పోశం


పోశం మధుసూదన్‌రెడ్డి

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రకటించారు. గతంలో పోశం దోసకాయలపాడు ఎంపీటీసీగా గెలిచి 2006 నుంచి 2011 వరకు ఎంపీపీగా పనిచేశారు. పార్టీ అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి జిల్లా పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పోశం పేరును ప్రతిపాదించారు. తనకు రాష్ట్ర స్థాయి పదవి ఇవ్వటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తనకు పదవి రావటానికి కృషి చేసిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, జిల్లా చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన పోశం మధుసూదన్‌రెడ్డికి పార్టీ నాయకులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం

మార్కాపురం: కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన దివ్యాంగుడు ప్రగడా వెంకటేశ్వర్లు తన తల్లి అనారోగ్యంతో ఉందని, ఆదుకోవాలని చేసిన విజ్ఞప్తి మేరకు శనివారం వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి, ఎస్.రమణారెడ్డి, హరిప్రసాద్ తదితరులు ఆర్థిక సాయం అందించారు. వారికి వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా చెన్నకేశవస్వామి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామివారి శాంతి కల్యాణాన్ని శనివారం ఆలయ మధ్యరంగ మండపంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని వివిధరకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాయలసీమ జిల్లా నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సరికాదు

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ నాయకులు అందె నాసరయ్య, ఖాశీం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలకు భారంగా మారిన నూతన విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వం పెంచిన సర్ఛైర్జ్ విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుప్పట్ల కాశయ్య, శంకర్, లక్ష్మీ నాయక్, వెంకటేశ్వర్లు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయానికి బస్సులు నడపాలి

మార్కాపురం: పెద్దారవీడు మండలంలో ఉన్న కేంద్రీయ విద్యాలయానికి మార్కాపురం నుంచి 2 బస్సులు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు మార్కాపురం ఆర్టీసీ డీఎంకు విజ్ఞప్తి చేశారు. సుమారు 115 మంది విద్యార్థులు అక్కడ చదువుతున్నారని, దేవరాజుగట్టు, గొబ్బూరు, తోకపల్లి నుంచి 50 మంది పిల్లలు అదనంగా ఎక్కుతారని, ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు, ఆ తరువాత 7.30 గంటలకు మార్కాపురం డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఒక బస్సు మాత్రమే ఉందని, ఆ బస్సు కూడా బి.చెర్లోపల్లి మీదుగా వెళ్తుండటంతో ఎక్కువ మంది పిల్లలు వెళ్లడం లేదని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. రెండు బస్సులు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు నిల్చొని వెళ్లే ఇబ్బందులు తప్పుతాయని డీఎంను కోరారు.

మెగా పేరెంట్స్ సమావేశానికి హాజరుకావాలి

బేస్తవారిపేట: విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొనాలని ఎంఈఓ చేగిరెడ్డి రమణారెడ్డి కోరారు. శనివారం స్థానిక ఎంపీఎస్ మెయిన్ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు సమావేశానికి తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు.


అండర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన రెస్టారెంట్


దుకాణాల ముందు నుంచి పారుతున్న మురుగు

ఇళ్ల ముంగిట మురుగు

- నిబంధనలకు విరుద్ధంగా అండర్ గ్రౌండ్‌లో రెస్టారెంట్
- రోడ్డుపైకి వదిలేస్తున్న రెస్టారెంట్ వ్యర్థాలు
- దుర్వాసనతో వ్యాపారుల ఇబ్బందులు

దర్శి: సాధారణంగా ఇళ్ల ముంగిళ్లలో ముగ్గులు వేసుకుంటాం. ముంగిళ్లు అందంగా తీర్చు దిద్దుకుంటాం. దర్శి గడియారం స్తంభం సెంటర్‌లో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. దుకాణాల ముందు ముగ్గులకు బదులు మురుగు పారుతోంది. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. దర్శి పట్టణ నడి బొడ్డులోని గడియారం స్తంభం సెంటర్‌లోనే. వివరాలు.. టీడీపీ నేతకు చెందిన ఎస్ఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని అండర్ గ్రౌండ్‌లో అతిథి పేరుతో ఒంగోలుకు చెందిన వ్యాపారులు రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. ఇది తూర్పు చౌటపాలెం రోడ్డు దుకాణదారులకు శాపంగా మారింది. ముక్కు మూసుకుంటేగానీ ఆ దుకాణాల వద్దకు వెళ్లలేని దుస్థితి ఏర్పడిందంటే దుకాణాల్లో నిత్యం ఉండే వారి పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పక్కర్లేదు. కొందరు దుర్వాసన భరించలేక దుకాణాలు మూసి ఇళ్లకు వెళ్లిపోతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పొదిలి రోడ్డులోకి ఫేసింగ్ ఉంచి అండర్ గ్రౌండ్‌లో రెస్టారెంట్ ఏర్పాటు చేసి ఆ మురుగు ముందుకు వెళ్లేందుకు వీలు పడక వెనుక వైపు ఉన్న తూర్పుచౌటపాలెం రోడ్డులోని రెస్టారెంట్ వెనుక నుంచి రోడ్డుపైకి పైపులు వేసి మరీ మురుగు వదులుతున్నారు. కాలువల ద్వారా మురుగు బయటకు పంపాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా మురుగును రోడ్డుపైకి వదులుతున్నారు. మురుగు నీటితో పాటు రెస్టారెంట్ నుంచి వచ్చే మాంసం వ్యర్థ పదార్థాల మురుగు ఇళ్ల ముందు నుంచి పారుతోంది. దీంతో వ్యాపారులు ఆ వాసన భరించలేక దుకాణాలు మూసి వెళ్తున్నారు. ఈ తంతు ఏడాది నుంచి జరుగుతున్నా ఆ కాంప్లెక్స్ టీడీపీ నాయకుడిది కావడంతో రెస్టారెంట్‌ను ఖాళీ చేయించే సాహసం చేయడం లేదు. వాస్తవానికి అక్కడ అందరూ చిరు వ్యాపారులే. రెక్కాడితే గానీ డొక్కాడని వారు కావడంతో గట్టిగా మాట్లాడితే తమను ఇబ్బందులు పెడతారేమోనని బయటకు చెప్పుకోలేక లోలోన మదన పడుతున్నారు. రెస్టారెంట్ యజమానికి పలుమార్లు విన్నవించినా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. ఎవరైనా గట్టిగా మాట్లాడేందుకు భయపడుతున్నారు ఎవరైనా వెళ్లి గట్టిగా ప్రశ్నిస్తే వారిని బెదిరించి పంపుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు

నగర పంచాయతీ అధికారులు, పాలకులు ఆ మురుగుపై బ్లీచింగ్ చల్లడం, రాత్రి పూట మురుగు తొలగించడం వంటి తాత్కాలిక చర్యలు చేపడుతున్నారుగానీ నివాసాల ముందు మురుగు పారకుండా మాత్రం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. ఇంత భయంకరంగా మురుగు పారుతున్నా ఆ రెస్టారెంట్‌పై మాత్రం ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కూడా ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వాస్తవానికి రెస్టారెంట్ ఓపెన్ చేయాలంటే మురుగు వెళ్లేందుకు డ్రైనేజీ, పార్కింగ్ వంటి అన్నీ సౌకర్యాలు కల్పించాలి. అలాంటి వేమీ లేకుండానే గడియారం స్తంభం సెంటర్ నడిబొడ్డులో రెస్టారెంట్ ఏర్పాటు చేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక రెస్టారెంట్ కోసం ఇంత మందిని ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మురుగు బయటకు వెళ్లేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై నగర పంచాయతీ కమిషనర్ మహేష్‌ను వివరణ కోరగా కాలువలకు టెండర్‌లు పిలిచామని, కాంట్రాక్టర్‌లు పనులు ప్రారంభించాల్సి ఉందని వివరణ ఇచ్చారు.


రోడ్డుపై పారుతున్న మురుగు

నీటి కోసం రోడ్డెక్కుతున్న మహిళలు

- పైపులు తెచ్చుకుంటే నీరు సరఫరా చేస్తామంటున్న అధికారులు

యర్రగొండపాలెం: తాగు నీటి కోసం మహిళలు రోడ్డెక్కుతున్నారు. పనులు వదులుకొని నీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాల్లో నెలకొన్న పరిస్థితుల గురించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మొరపెట్టుకున్నా ఫలితం కనిపించడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్యాంకర్లతో అరకొర నీరు సరఫరా చేస్తే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు బోర్లు రీచార్జ్ అయ్యాయి. వాటి నుంచి నీరు పట్టుకోవచ్చు. ట్యాంకర్ల సంఖ్య తగ్గించడంతో నీటి కొరత ఏర్పడింది. ట్యాంకర్ల యజమానులకు పాత బకాయిలు ఇవ్వకపోవడంతో పాటు కొత్తగా తోలకం చేస్తున్న వారికి కూడా అధికారులు బిల్లులు చేయక పోవడంతో వారు కూడా నీటి సరఫరాను అంతంత మాత్రంగా చేస్తున్నారు. శనివారం మండలంలోని యల్లారెడ్డిపల్లెలో బిందెలు పట్టుకొని మహిళలు గుంపులు గుంపులుగా నీటి కోసం బయల్దేరిన దృశ్యం చూస్తే కలచి వేస్తోంది. గ్రామంలో ఉన్న డీప్‌వెల్ బోర్లు పూర్తిగా అడుగంటడంతో వాటి నుంచి వచ్చే నీరు సరిపోవడం లేదని ఆ గ్రామస్తులు తెలిపారు. పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే సాగర్ నీరు ఇటీవల కాలంలో వారానికి ఒక రోజు వదులుతున్నారని ఆ గ్రామస్తులు తెలిపారు. ఇదేమిటని అధికారులను అడిగితే గ్రామంలో పూర్తిగా నీరు అందాలంటే కొత్త పైప్ లైన్ వేయాల్సి వస్తుందని, గ్రామస్తులు పైపులు తెచ్చుకుంటే తాము లైన్ లాగుతామని సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపుల నుంచి నీరు వచ్చే ప్రాంతానికి వెళ్తే ఆ ప్రాంతం వారు అభ్యంతరం తెలుపుతున్నారని, ఈ పరిస్థితులను తట్టుకోలేక పోతున్నామని తెలిపారు. దాదాపు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న బిల్లగొందిపెంట చెంచుగూడెం వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. చెక్కబల్లపై బిందెలు పెట్టుకొని అతికష్టంతో నెట్టుకుంటూ నీరు తెచ్చుకుంటున్నామని మరి కొంతమంది మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నీటి కోసం బిందెలు పట్టుకొని నిల్చొన్న మహిళలు

అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రామంలో నీటి ఎద్దడి ఉంది. సాగర్ పైప్ లైన్ ద్వారా నీరు రావడం లేదు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. పైపులు తామే కొనుగోలు చేసి వారికి అప్పగిస్తే మరో లైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తామంటున్నారు. ట్యాంకర్లకు తాము సొంతంగా డబ్బులు చెల్లించి నీటిని పట్టుకుంటున్నాం. ఓట్ల కోసం తమ ఇళ్ల చుట్టూ తిరిగిన నాయకులు నీటి సమస్య తీర్చలేక పోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి నీరు సరఫరా చేయాలి.

– మీనిగ చిన్నబ్రహ్మయ్య, గ్రామస్తుడు

పనులు వదులుకొని నీరు తెచ్చుకుంటున్నాం



వారంలో రెండు రోజులు పనులు మానుకొని నీరు తెచ్చుకుంటున్నాం. 3 కిలోమీటర్లు నడిచి వెళ్లి బిందెలు మోసుకుంటూ నీరు తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. నీటి సమస్యతో అల్లాడిపోతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదు. వెంటనే కొత్త పైప్‌లైన్ వేసి నీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– పుల్లమ్మ, గ్రామస్తురాలు

ప్రతి ఒక్కరూ ధర్మానికి కట్టుబడి ఉండాలి

దర్శి: ప్రతి ఒక్కరూ ధర్మానికి కట్టుబడి ఉంటే సత్వర న్యాయం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ ఎస్.శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ పనులు మానుకుని కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు, సమయం వృథా చేసుకునే కంటే కేసులు రాజీ చేసుకుంటే అందరికీ మంచి జరుగుతుందన్నారు. ఒక కేసులో రాజీ చేసుకుంటే ఇద్దరూ గెలిచినట్లేనని చెప్పారు. అదే పంతాలకు పోయి కోర్టుల చుట్టూ తిరిగితే ఎవరో ఒకరే గెలుస్తారని, మిగిలిన వారు బాధపడటం, కక్ష సాధింపుకు పూనుకోవడం వంటివి జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు జరగవని చెప్పారు. అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీత మాట్లాడుతూ కోర్టుల చుట్టూ తిరిగి శిక్షలు పడి జైలుకు వెళ్తే తమ పరువు పోవడమే కాకుండా కుటుంబంలో వారందరూ అవమానంగా భావిస్తారన్నారు. అదే రాజీ చేసుకుంటే అందరికీ మంచి జరుగుతుందని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం చేసుకుంటే హైకోర్టులకు వెళ్లేందుకు కూడా అవకాశం ఉండదన్నారు. రాజీ అనేది రాజమార్గం వంటిదని సూచించారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివశంకర్‌రెడ్డి


కక్షిదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

పుల్లలచెరువు: మార్కాపురంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పలు కేసులు రాజీ చేసుకున్నట్లు ఎస్‌ఐ సంతపకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టేషన్ పరిధిలో నమోదైన 58 కేసులకు సంబంధించి కక్షిదారులు కోర్టులో రాజీ పడినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఆలోచన చేసినప్పుడే రాజీ మార్గం రాజ మార్గం అవుతుందన్నారు.

ఆర్టీసీలో 10 వేల ఖాళీలు భర్తీ చేయాలి

మార్కాపురం: తమ న్యాయమైన కోర్కెలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఉద్యోగులు రెండో రోజు శనివారం ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నా చేశారు. మార్కాపురం డిపో ఎదుట ధర్నాలో యూనియన్ నాయకుడు ఎస్‌వీఎస్ శాస్త్రి మాట్లాడుతూ.. అర్హులైన ఉద్యోగులకు తక్షణమే ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల పోస్టులను భర్తీ చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ సొంతంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బస్సులను ప్రైవేటు ఆపరేటర్లకు లీజుకు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దనరావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఐఆర్ తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు సంబంధించిన జీఓను యథావిధిగా అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారులు కేఎంపీఎల్ పేరుతో డ్రైవర్లను వేధించడం మానుకోవాలని, చాలా కాలం నుంచి ఒకే సీటులో ఉన్న డిస్పాచ్ మెకానిక్, కేఎంపీఎల్ మెకానిక్‌లను మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి శేఖర్ నాయుడు, డిపో కార్యదర్శి నాని, ఏడీసీ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, శంకయ్య, జాకీర్ హుస్సేన్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: స్థానిక డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు చక్రపాణియాదవ్ మాట్లాడారు.

మొక్కలతో పర్యావరణాన్ని కాపాడాలి

పెద్దారవీడు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రిన్సిపాల్ కర్తార్‌సింగ్ గుర్జర్ అన్నారు. మండలంలో రాజంపల్లి సమీపంలోని కేంద్రియ విద్యాలయ ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలని, ప్రజలకు పర్యావరణపై అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని, చిన్ననాటి నుంచే వృక్షాల మహత్తును గ్రహించాలని సూచించారు. మొక్కలు నాటుతున్న సమయంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హరిత హారం నినాదాలతో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

తిరుమలనాథస్వామికి పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొౖడ్రాలికొండ తిరుమలనాథస్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దర్శి: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతురావు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్‌లకు వినతి పత్రాలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా శనివారం దర్శి నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఇంజినీరింగ్ విభాగంలో ఒప్పంద కార్మికుల వేతనాలు పెంచాలని, వారికి కూడా సంక్షేమ పథకాల్లో అర్హత కల్పించాలని కోరారు. మున్సిపల్ రంగంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న అన్ని రకాల సిబ్బందికి రూ.24500 జీతం జీవో నంబర్ 36 ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు సత్వరమే చెల్లించాలన్నారు. డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో కూటమి ప్రభుత్వంపై దశలవారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి, ఏఐటీయూసీ నాయకులు సింగరకొండ శ్రీను, మున్సిపల్ కార్మికుల సంఘ అధ్యక్షుడు ఇత్తడి ఇర్మియా, దావీదు, మరియమ్మ పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వేడుకగా చిన్న షహదత్


చందవరంలో ఉత్సవ పీర్లు


ఇండ్లచెరువులో హోమ గుండం

దొనకొండ: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో చిన్న షహదత్ ఉత్సవాన్ని వేడుకగా శుక్రవారం రాత్రి నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సంతానం లేని స్త్రీలు తలంటి స్నానాలు చేసి ఉదయం నుంచి ఉపవాసం ఉండి హోమ గుండం వద్ద పూజలు చేసి పీర్ల వద్ద దీక్ష బూనారు. సంతానం కలిగించాలని కోరుకున్నారు. మండలంలోని చందవరం, ఇండ్లచెరువు, కొచ్చెర్లకోట, నరసింహనాయునిపాలెం, మల్లంపేట గ్రామాల్లో అన్ని కుల, మతస్తులు ఐక్యంగా చిన్న షహదత్ వేడుకలో పాల్గొన్నారు. ఆదివారం రాత్రి పెద్ద షహదత్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. యువకులు ఉత్సాహంతో పీర్ల చావిడి ముందు హోమ గుండాలు తవ్వి నిప్పు వేశారు. ఆదివారం రాత్రికి పెద్ద షహదత్ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆర్వో ప్లాంట్లలో నీరు సురక్షితమేనా?

- నాణ్యతను తనిఖీ చేయాలని అధికారులకు సూచించిన ఎంపీపీ

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని ఆర్వో ప్లాంట్లలో నీటి నాణ్యతను తనిఖీ చేసి ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బండి లక్ష్మీదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం పరిశీలించి, మోతాదు అధికంగా ఉన్న గ్రామాల ప్రజలకు సురక్షిత నీరు అందేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం కూలీల వద్ద అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కాపురం మండలంలోని నరసింహాపురం పరిధిలో ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. బొందలపాడులో ప్రభుత్వ పాఠశాల వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని స్థానిక సర్పంచ్ కోరగా ఎంపీడీఓ శ్రీనివాసులు సానుకూలంగా స్పందించారు. వివిధ సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతోపాటు, ఏఓ బుజ్జిబాయి, వెటర్నరీ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ఏపీఓ నాగరాజు, హెచ్ఓ రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి, పక్కన ఎండీడీఓ

851 కేసుల పరిష్కారం

మార్కాపురం: మార్కాపురం జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 851 కేసులు పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం శుభవాణి, సీనియర్ సివిల్ జడ్జి దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కిశోర్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ ఆధ్వర్యంలో నాలుగు బెంచ్‌లె ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.